కథానిక

# అనవుడు — నావుడు

శ్రీ మల్లాది రామకృష్ణ శాస్త్రి

●

మా గ్రామం పొలిమేరనున్న లంజ దిబ్బల్లో ఒకదానిని త్రవ్వించడానికి పురాతత్త్వశాఖ వారు, మొన్న మొన్ననే పూనుకున్నారు.

ఆ ప్రదేశంలో ఉన్నది ఒక్కటే దిబ్బ కాదు సుమండి! చెల్లా చెదరుగా, వరసి చిన్నా పెద్దా కలిసి మూడు! చీకటి పడిన తరువాత సాధారణంగా, ఆ చాయలకు ఆసాములెవరూ పోరు. దయ్యాలూ భూతాలూ ఉంటాయని కాగు ఆ చుట్టు పక్కల అంతటా వల్లమాలిన గచ్చ పొదలు! రాత్రి, ఓ ఝాము పొద్దు వేళనుంచీ, తొలికోడి కూసే దాకా, - 'గలా - గలా చెంగ్ చెంగ్' మంటో సన్న సన్నగా గాలి వాటున సవ్వడి వినబడుతూ ఉంటుంది!

ఆ మూడు దిబ్బలూ ముగ్గురు అక్కాచెల్లెళ్లట అందులో పెద్దది అప్పగారు - తతిమ్మావి చెల్లెళ్లూ వాళ్లు, కొల్లేరు పెద్ద సరస్సుగా శాపంతో మారక మునుపు, అక్కడ రాజ్యంచేసిన రాజుగారి కూతుళ్లట.

ఆ ముగ్గురు కన్నెలకూ యుక్త వయసు రాగానే రాజుగారు దేశదేశాలా స్వయంవరం చాటించారట! ఆకాశమంత పందిరీ, భూమంత వేదికా వేయించి. మూడు పెళ్లిళ్లకూ ఒకే ముహూర్తం పెట్టించి, కోలాహలంగా, సప్తసన్నాహాలూ చేశారట! ఏలేవారి ముగుదల శిరసావహించి ఆసీమలో ప్రజలందరూ, ఆ బాల గోపాలమూ ఎవరింటో పొయ్యి వారు త్రవ్వేసుకుని, పట్టు తాపితాలు చేతబట్టుకుని,—అన్ని వర్ణాల వారూ దేవతార్చనకు, రాజుగారి దేవిడీకి తరలివచ్చారట. ఇక, లెక్కకు నాలుగు రోజులుంది. స్వయంవరం అది, కాగానే వారం తిరిగివచ్చేసరికి సుమూహూర్తం!

ఇది, ఇలా ఉండగా, ఆయేడు అదేం మాయో కాని, వర్షాలు, ఒక్కమాసం ముందుగానే ముంచుకొచ్చాయట! రథాలెక్కి ఏనుగులెక్కి, సిబ్బందితో సింగారంగా పెళ్లి నడకలతో తరలివస్తున్న ఛప్పన్న దేశాల రాకొమరులూ, రాజ్యానికి రెండు మజిలీలు ఆకడనే ఆగిపోవలసి వచ్చిందట.

గంగ మడుగులు, కాలవలైనాయి - కాలువలు నదులైనాయి - నదులు ఏక సముద్రం కాగా, - ఎక్కడి వారక్కడే హరినామస్మరణ చేసుకుంటూ ఆగిపోవలసిన తిప్పలు వచ్చినాయి! కాకిచేత కబురంపుదామనుకున్నా - ఎటుచూసినా అంతా నిరామయంగా ఉంది. ఎక్కడా, ఏదిక్కునా పిట్ట ఆడటం లేదు

దిగబడిన రథాలు దిగబడినట్టే ఉన్నాయి. ఏనుగులూ, గుర్రాలూ, తక్కింగల చిల్లరమల్లర జంతువులూ, సేనా సమూహము,—ఒక్క ముక్కలో చెప్పాలంటే రథగజ తురగ పదాతి సమూహము ఒక్కుమ్మడిగా, రొంపపట్టి దిక్కులు మార్మోగేట్టు తుమ్ముతూ పడుందట.

ఈ పరిస్థితులన్ని తాము స్వయంగా కొంత మేరకు చిత్తగించీ, మహామంత్రులు మనవిచేయగా ఆలకించీ-బయలుదేరి వచ్చిన పెళ్లికొడుకు లందరికీ, — ఒక్కసారి దిగ్భ్రమ చెందటంతో మతి పోయిందట అందరి మట్టుకూ ఎవరికి వారే హతాశులై, జాతకం ప్రకారం తమకు యీ సంవత్సరం కల్యాణయోగం లేదేమో అని అనుకునేంత స్థితికి వచ్చారట

ఇక్కడ, మాటకు అడ్డం వచ్చి, ఒక్క ముక్క మనవి చెస్తేనే కాని, స్వారస్యం ఉండదు. అందరికీ రొంప పట్టిందనుకున్నామే అది కొంచెం అతిశయోక్తి! తరలి వచ్చినమందీ మార్బలంలో కొందరు మహేళ్లుండక తప్పదుకదా! ఎల్లకాలం ఎండలో ఎండి, వానకు తడిసేవాళ్లకు-యీ రుతువు మార్పు ఏమీ కుట్టినట్లు లేదు ఆ గుంపు గుంపూ ఒక్క తుమ్ము తుమ్మిన పాపాన పోలేదు.

వాళ్లందరూ, ఏ రథం చాటున తల దాచుకుని, ఏం గూడు పురానీ చేశారో కాని, ఒకనాడు, సాయం సమయమున వాళ్లలోకి కులవృద్ధు, వ్యాసులవారి లాటి మహేలు, మహారాజబిడ్డ లందరికీ నమస్కారం చేసి, యిలా మనవి చేశాడట.

"ఏలిన వారందరూ, యీ చాకలివాడి మనవి కాదనకుండా; చిత్తగించాలి! మహాప్రభువులందరూ యిక్కడ చిక్కుపడ్డారు! తమ జాడ తెలియక పెళ్లికొమార్తెల కన్న ప్రభువులవారు అక్కడ చికాకు పడుతూ ఉంటారు.

అయ్యల సెలవైతే, నా చేతిక్రింద పడుచువాళ్లను ముగ్గురిని, ఆగ మేగాలమీద తమరు చేరువకు వచ్చారని—కబురు చెప్ప నగరానికి తరుముతాను ఒక్క కబురుకు ముగ్గు రెందుకంటిరా-

దారి పొడుగునా, అగడ్తలూ, అగాధాలూ గండ! ఒక్కడైతే మునుగునో, తేలునో-మనిషికి మనిషి ఆసరాఉంటే—తప్పినా జారినా అడుగుతీసి అడుగు వేయచ్చు-

ఇద్దరైతే చాలదా అంటారేమో ప్రభువులు! ఒకడు ఊబిలో దిగితే, వాడికి చేయందిచ్చి రెండోవాడూ దిగబడితే—పిలిస్తే పలికేందుకన్నా-అక్కైందని, మనకు వేగుతెచ్చేందుకన్నా మరోడుండాలిగంద! -అందుకుని, ముగ్గురుండాలని మనవు లిచ్చుకున్నా" నన్నాడు! 'సరే' నన్నారు-పెళ్లికుమారులందరూ!

అందరూ అంటే ఎందరో అనుకునేరు-యింతకు ముందా మాట చెప్పడం మరచిపోయినా,-వచ్చింది, ముచ్చటగా ముగ్గురు! మరైతే ఛప్పన్న దేశాలవారు తరలి వస్తున్నారంటివి గందా-అంటారా ? -అవునయ్యా,-వస్తూన్నారు - వెనకాతలే వస్తున్నారు-కొందరు వెనక మజిలీలో-మరి

http://www.maganti.org/

కొండ రా వెనక మజిలీలో - ఉన్నారు! రెప్పదిమీద వస్తారు!

ఆఁ, మళ్లీ దోవకు వద్దాం—ఎక్కడున్నాం—పెళ్లికొడుకులు సరేనన్నారు కాదూ,-అంటే మహేలూ సరేనన్నాడు ముగ్గురు చిన్నవాళ్లనూ ముందుకు రప్పించాడు. చేరవలసిన కబురేదో ముమ్మారు చెప్పించాడు! ప్రాణాలకు తెగించైనా పట్నం చేరుకుంటా మని, వాళ్లచేత దొరల పాదాల దగ్గిర ప్రమాణం చేయించాడు.

చేయించాడు సరేనయ్యా! వాళ్లు కాళ్లు కదపండే! 'ఆనవా లిచ్చి పంపండయ్యా' అని మరోతూరి మనవి చేసుకున్నాడు మహేలు. ఏం ఆనవాలురా? — అన్నారు అయ్యలు ముగ్గురూ-'అవే-అవే-పట్టిన కత్తీ పెట్టిన పాగా,--వేసుకున్న దిరేనూ-యిచ్చి పంపండయ్యా --- వట్టి చేతుల్తో, నోటి మాటల్తో వెళితే-చాకలోళ్ల మాటలు మా రాజులు నమ్మ తా రా - అయ్యకు చూపేందుకూ ఆ హంగులూ, ముద్దరాలికి చూపేందుకు ముద్రికలూ-' యిప్పించమన్నాడు మహేలు యిచ్చి పంపారు దొరలు

ఇక మాసుకోండయ్యా, ముగ్గురూ కొర మీనుల్లా వాగుల కడ్డంబడి-లోతనక రొంపనక ఒక్క లగువున రెండు ప్రొద్దులు వాలే సరికల్లా-నగరం పొలిమేరల్లోకి జేరుకున్నారు

అక్కడ ఓ క్షణం ఆగిపోయినారు. మహేలు చెప్పిన ఆలోచన మనసులో నెమరేసుకున్నారు. తడిబట్టలు విడిచారు. అయ్యలిచ్చిన దిరేసుకట్టుకుని. - డాలూ డవాలూ పట్టుకుని,-రొమ్ము విరుచుకుని,-కోట గుమ్మంలో కాలు పెట్టారు

కాలు పెట్టీ పెట్టంగనే-కోటలో నగారాలు మ్రోగినాయి-వెయ్యి దీపాలు ఒక్కమొయిని వెలిగినాయి. తడితడిగా ఉన్న భూమ్మీద అడుగుదీసి అడుగు వేసుకుంటూ రాజుగారు-అరతి పట్టించి, ఆడంగులచేత దిష్టి తీయించారు.

అక్కడా యిక్కడా కాదని, - అబ్బయ్యలు ముగ్గురునీ వెంట తోడుకుని,- తానుండే కోటలోకి తీసుకు వెళ్లాడు. మూడు పొద్దులకు, మహేలు బిడ్డలు ముగ్గురూ కడుపునిండా బువ్వదిని కంటి నిండా నిద్ర పోయినారు

భళ్ళున తెల్లవారింది. ఫెళ్ళున ఎండ వచ్చింది. ఆ పొద్దే స్వయం వరము. కాని, మరో దొరకొడుకు ఆ చేరువకు రాందే—

పోనీ అదీ ఒకందుకు మంచిదే అనుకున్నారు. మహారాజువారు - కుమార్తెలు ముగ్గురితోనూ సంప్రదించాడు! పిల్లలు ముగ్గురూ మారు మాట చెప్పకుండా, చిలకలల్లే ఒకరిని చూసి ఒకరు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ తండ్రి వంక చూసీ చూడనట్టూ ఓరకంటచూసి తల వంచుకున్నారు.

పరమానంద భరితులౌతూ, మహారాజుగారు, అమ్మాయిల చెలికత్తెలను పిలిపించుకుని, అసలు వైనమేమిటి, చిరంజీవుల మనస్సులో ఉన్న అభిప్రాయం ఏమిటీ— అని వాకబు చేయగా, తేలిందేమయ్యా అంటే—

అబ్బాయిలు ముగ్గురూ గాఢనిద్రలో ఉండగా, అమ్మాయిగార్లు చెలికత్తెలను చాటు చేసుకుని, ఆ చిన్నవాళ్ళు శయనించిన మందిరంలోకి, అల్లంత దూరాన్నుంచి తొంగి చూశారట! వారి కిరీటాలూ కత్తులూ చూసి,-మొగం చూడక్కర్లేకుండానే తక్షణం వరించారట-వరించినప్పటి నుంచీ-ఒక్కటే తాపంట. ఒక్కటే విరహంట-

అయితే, యిక స్వయంవరంతో అవసరం ఏముందనుకున్నారు మహారాజుగారు. అయినప్పటికీ మహామంత్రులవారి సలహానంగీకరించి,-కొంత తడవు నిదానించి చూశారు. అనుకున్న వేళకు అతిథి, అభ్యాగతులు మరెవ్వరూ రాకపోయేసరికి,- ఆ ముగ్గురికి యీ ముగ్గురూ 'శుభం' అనుకున్నారు.

యీ శుభవర్తమానం- పెళ్లికొడుకులకు చెప్పేందుకు - మహా మంత్రిగారికి ఆజ్ఞాపించారు.

మంత్రిగారు వచ్చేసరికి మందిరంలో ఏం జరుగుతున్నదయ్యా అంటే-ఎవడికి వాడు నిద్రలేచి,-అలవాటు ప్రకారం ఎవడిపనులు వాడు చేసుకుపోతున్నాడు. ఒకడు చీపురట్టుకు ఊడుస్తున్నాడు - ఒకడు దుమ్ము దులుపుతున్నాడు. మూడోవాడు చాపలు చుట్టుతున్నాడు.

మంత్రిగారు, ఒక్కచూపులోనే-వీళ్ళ కులం వీళ్ల గుణం తెలుసుకున్నారు తలుపులు బిగించి - కత్తిచేత బట్టారు కాని - ఒకడికి ముగ్గురుండిరేమో ఒక్కడూ వణకలా!-'ఓరయ్యానీ ధాంధూములు మా కాడ కావు-మాట యింటివా సిరసుంటది-రాజ్యంలో సగం నీ సేతుంటది-' అన్నారయ్యా! ఆ మంత్రి ఎంత పాపకర్ముడో కాని,-ఆసీమ పుట్టి ఆ సీమ పెరిగి - ఆ కొలువు కొలిచి అంత పాపానికి ఒడిగట్టినాడయ్యా!-

సరేనన్నాడు. చేతిలో చేయి వేయించుకున్నాడు పిల్లవాళ్ళు ముగ్గురికీ పెళ్లయే దాకా మౌనవ్రతం అన్నాడు ఎవరూ పలుకరించరాదన్నాడు అన్నిటికీ రాజుగారు సరేనన్నాడు

మళ్ళీ తెల్లవారింది. ఇక మరో గడియకు ముహూర్తం పెళ్లి కొమాళ్లు ముగ్గురూ వెళ్ళి కొల్లేరమ్మను కొలిచివచ్చి బాసికం కట్టాలి. బయలుదేరారయ్యా పెళ్లికొడుకులు!

వీరిటు బయలుదేరడం చూసి అక్కాచెల్లెళ్ళు ముగ్గురూ గచ్చకాయలు ముందోసుకు కూచున్నారు - గౌరిదేవి పాట పాడుకుంటూ పాటయేసరికి, ఆటకావాలి! ఆటయేసరికి - మంగళాస్నానం - అదైతేనే ఆడకూతురికి ఐదువతనం - వేయి కాలాలపాటు నిలుస్తుందని - ఏనాటి నుంచో వస్తున్న నమ్మకమాయెను -

అక్కడ - ఆ శివశక్తిని చూడగానే - ముగ్గురు పెళ్లి కొడుకులకూ కాళ్లువడకినాయి. అడుగు వెనక్కివేశారు. కాని వెనుక నిలుచున్న మంత్రి, ఓ అడుగు ముందుకు త్రోశాడు 'అది గొర్రెల్నీ మేకల్నీ తినేదిరా - మీ జోలికి రాదని',

వెన్ను చరిచాడు. వాళ్ళు వెన్ను విరిచారు: అక్కడే మంత్రికి అర్ధరాజ్యం ధారాదత్తం చేశారు - మీసం మీద చేయి వేశారు.

ఇక చూచుకో అయ్యా! - ఆ తల్లికి ఉగ్రం వచ్చిందో వాళ్ల పాపం పండిందో కాని, - ఆకాశం చిల్లులు పడ్డాయి- సముద్రాలకి కట్టలు తెగినాయి - ఏక వెల్లువైంది - దేశం నేలగలసిపోయింది.

ఆ పొంగులోపడి ఆ ముగ్గురు పెళ్లికూతుళ్లూ కొట్టుకొచ్చి - యిక్కడ దిబ్బేసుకుపోయినారు. ఆ మంత్రి గచ్చపొద అయిపోనాడు వెళ్లిన వాళ్లకోసం - వాళ్లు అలాగే గచ్చకాయలాడుతూ కూచున్నారటయ్యా!-

వానవెలిసి వంగుడు వెలిసిన తరువాత. తరలివచ్చిన రాజులు రాలేదా - అంటారా- - రాకేం వచ్చారు! వచ్చిచూస్తే. ఏముంది- ఊరున్నచోట ఏరుంది ఎవడికి వాడే వెలాతెలా పోయినారు - అందరూ అన్నింగలైపోయి - ఆ యేటిమీదే తిరుగుతుంటారటయ్యా! -

మరి, - యింత ఘాతుకం తలపెట్టిన ఆ పెళ్లికొడుకులగతేమి టంటారా - పెద్దలు చెప్పలా -

తాజాకలం - దిబ్బ తవ్వించడానికి వచ్చిన ద్రవిడ అధికారితో తాతయ్య యీకథ అప్పటి కప్పటికి కల్పించి-(యిందుకు తాతయ్య హామీ) చెప్పగా-పెళ్లీడు పిల్లలున్న ఆ గృహస్థు, అయ్యోపాపం అని ముక్కుమీద వేలేసుకుని-ఏతత్ దిబ్బలో, ప్రాచీన సామాగ్రి దొరకదనీ, అది కేవలం అధునాతనమైన పాటిమట్టి దిబ్బమాత్రమేననీ, - పక్కచేలోంచి పాటి మన్ను శాంపుల్సుతో కలిపి - కేంద్ర ప్రభుత్వంవారికి ఒక బృహత్ నివేదిక పంపుకుని, - తాతగారింట ముప్పొద్దులు విందు కుడిచి, మరో దిబ్బను వెదుక్కుంటూ వెడలిపోయినాడు.

తాతయ్యలో ప్రగతి శీలత లేదంటారా మీరు. అనండి - ఆయన ఒక్కడిలోనే కాదు - మా ఏ ఒక్కడిలోనూ లేదు ఆ దిబ్బలు, ఆ పొదలూ, ఆ రొదలూ లేకపోతే, - మాకు మా సీమకు వేడుకేముంది - ముచ్చటేముంది!

వెయ్యి అబద్ధాలాడి ఒక్క యిల్లునిలపమన్నారు పెద్దలు - ఒక్క అబద్ధం, ఆడి, మూడు దిబ్బలు కలకాలం నిలిపాడు తాతయ్య! స్వస్తిరస్తు.

---

# కాత్యాయని

(4-వ పేజీ తరువాయి)

ఆ వెనక్కి తిరగటం విసురులో కత్తిమొన, అతని బుజంమీద చెయివేయబోతున్న ఆ అమ్మాయి మణికట్టుకు తగిలింది. చిరునెత్తురు కారబోతోంది.

కాటడికి కళ్ళు బైర్లుకమ్మాయి.

ఆ అమ్మాయి మొగాన మందహాసం చెదరలేదు. బస్తాలమీదపడిఉన్న ఒక గుడ్డపేలిక చింపి మణికట్టుకు కట్టుతూంది.

“ఏం కావాలో చెప్పలేదేం” మళ్ళీ నవ్వుతూ అడిగింది. కాటడు మహా భీకరంగా అడుగుతున్నాననుకొన్నాడు కాని గొంతు పీలగా అర్థిస్తూంది,

“ధాన్యం కావాలి నామురాకు మూడు రోజులబట్టి తిండిలేదు.”

“అయ్యో! ఇన్నాళ్ళూ ఏం చేస్తున్నావ్! భోజనం వేళకు జనాన్నిక్కడకు తీసుకురాకపోయ్యావా? అయ్యో పిచ్చివాడా..!”

ఆ అమ్మాయి పలుకులో, పసిపిల్లపలుకు కన్న అమాయకత ఉట్టిపడుతోంది

“అదుగో రెండు బస్తాలు జొన్నలు, దంపినబియ్యం అప్రక్కన వున్నాయి. మీరు జొన్నలు తింటారా, వరేగాని సైంచదా?”

కాటడు మాట్లాడలేక కాత్యాయని చేతి మణికట్టువంకే చూస్తున్నాడు.

“మరి బస్తాలు మవ్వొక్కడివే మోసుకెళ్లగలవా?”

కాటడికేం జవాబు చెప్పాలో తెలియటంలేదు. “నా మురా ఉన్నారు...” అంటూ సన్నగా గొణిగాడు.

“అయినా ఇప్పుడు తీసుకుపోయి ఎప్పుడు వండుకొని తింటారు. పద అటు పద పాలేళ్లని పిలిచి ఇప్పుడే వంట పెట్టిస్తా! చప్పుడు చెయ్యకుండారా, అమ్మ లేస్తుంది ఇల్లారా!”

కాత్యాయని అతని చేయి పట్టుకొని దొడ్లోకి తీసుకుపోతోంది. కాటడు చేతిలో కత్తి ఎప్పుడో కింద జారిపోయింది.

పాలేళ్లను పెడరెక్కలు విరిచి కట్టమని చెప్పలేకపోయాడు కాటడు.

“వెంకా, మల్లా” అంటూ సన్నగా పిలుచుకొంటూ కాత్యాయని గొడ్లసావిడి దగ్గరకు నడిచింది. కాటడి చేయి ఆమె చేతిలోనే వుంది. పెంపుడు కుక్కలాగే వెనుక నడిచి వస్తున్నాడు.

కాత్యాయని వస్తూండటంచూసి మురా దొంగలు నల్గురూ గోడల నీడలోకి నక్కారు. కాటడు ఆమెవెంట అల్లా నడిచి రావటం వాళ్లకూ దిగ్భ్రమే కల్గిస్తోంది. ఆపగలు ఆమెచేతిభిక్ష స్వీకరించినవాళ్లకు ఆరాత్రి ఆమె కంటబడటానికి సాహసం రాలేదు.

“వెంకా, మల్లా, ఇదేమిటిరా ఇల్లా పడుకున్నారు.”

కాత్యాయని చటాలునవంగి వాళ్ల నోళ్లలో గుడ్డలుతీసి చేతికట్లు విప్పింది. అయాచితంగానే వాళ్లచేతులు ప్రక్కనున్న కఱ్ఱలమీదికి పోతున్నాయి.

“ఒరేయి ఆ కఱ్ఱలెందుకురా. పాపం తిండిలేక మలమల మాడిపోతున్న వాళ్లొస్తున్నారట. వెంటనే పొయ్యిలు వెలిగించండి. అమ్మకు మెళకువరాకుండా సావిట్లోనుంచి రెండు బస్తాలు మెల్లగా తీసుకురండి. ఏరబ్బాయి నీజనం ఏరి!”

దొంగ లొక్కరొక్కరే ‘తల్లీ దండం’ అంటూ ఎదుట బడ్డారు,

కాటడు వాళ్లవంకకు వికృతంగా చూస్తున్నాడు.

“గంగాళాలు తోమారా?” అని కాత్యాయని అడుగుతూంది.

పాలేళ్లకు పనులమీద దొంగలు సాయం వెళ్ళారు. కాటడిమురా, తక్కినవాళ్లందరూకూడా, వెంట రామన్నారేగాని, వెనకగావచ్చి ఇంటి ఆవరణచుట్టూ చేరి పొంచి చూస్తూనే వున్నారు

కాత్యాయనికి చీకటి వెలుగుల తేడా లేదన్నట్లుంది. నవ్వుతూ “వాళ్లేనా నీ వాళ్లు.” అంది.

కాటడు తలవూపాడు. నెమ్మదినెమ్మదిగా మురాఅంతా ఆవరణ లోపలికి వచ్చారు.

“అన్నట్టు నీ పేరేమిటి?”

“కాటడు”

“కాటయ్యా! మీవాళ్లందర్నీ తొక్కి-

http://www.maganti.org/

Source: Press Academy Website, Mitra Magazine, September 1955

**Disclaimer:** This topic/article/write-up of Sri Malladi Ramkrishna Sastri has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan